సాక్షి చిత్తూరు

మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



'స్పందన' అర్జీల పరిష్కారం

ప్రజలు స్పందనలో అందించిన అర్జీలను బాధ్యతగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులు ఆదేశించారు. - 8లో



పక్కాగా పట్టా.. హక్కు

నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద లబ్ధిదారులు పొందిన ఇంటి స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. - 8లో



ఆశలు మునిగె.. శోకం మిగిలె

తిరుపతి జిల్లాలో సోమవారం వేర్వేరు చోట్ల ప్రమాదవశాత్తు నీట మునిగి ఐదుగురు మృత్యువాత పడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

ఎస్‌ఈబీ ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఏఎస్పీ సుబ్బరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

చిత్తూరు అర్బన్: చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఏఎస్పీగా ఏవీ సుబ్బరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఏఎస్పీకి పలువురు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించారు.

వరసిద్ధుని సేవలో మోహన్‌బాబు



మోహన్‌బాబుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని సినీ నటుడు మంచు మోహన్ బాబు సేవించుకున్నారు. సోమవారం ఉదయం కాణిపాకం విచ్చేసిన ఆయనకు ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి స్వాగతం పలికి స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, ఉభయకర్తలు రవిరెడ్డి, చిన్నారెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

9న కాణిపాకంలో తై అమావాస్య పూజలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈ నెల 9వ తేదీన తై అమావాస్య పూజలు నిర్వహించనున్నారు. సోమవారం ఈ మేరకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు మాట్లాడుతూ తై అమావాస్యను పురస్కరించుకుని ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు వెల్లడించారు. అలాగే సాయంత్రం వరసిద్ధునికి గ్రామోత్సవం జరిపించనున్నట్లు వివరించారు.

రేపు కాణిపాకం వినాయకుని హుండీ లెక్కింపు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు సోమవారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి స్వామివారి ఆస్థాన మండపంలో కానుకలను లెక్కించనున్నట్లు వివరించారు.

ఐసీసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వెంకటశివ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : ఐసీసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులును కలిశారు.

కలెక్టరేట్ ఏఓగా వెంకటేశ్వరన్



వెంకటేశ్వరన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టరేట్ సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్ ఏఓగా పి.వెంకటేశ్వరన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఓ వెంకటేశ్వరన్‌కు రెవెన్యూ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్, ఉపాధ్యక్షుడు శివ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పార్థసారథి, హేమాద్రి, వరప్రసాద్, మధు పుష్పగుచ్ఛాలు అందించారు.

నాడు

ఒకే రకమైన రుచీపచీ లేని ఆహారం.. నాణ్యత ఉండదు.. పర్యవేక్షణ కరువు.. ఉపాధ్యాయుల ఉదాసీనత.. నిర్వాహకుల ఇష్టారాజ్యం.. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఆరగించేందుకు నరకం అనుభవించేవారు. సరైన పోషకాలు లేని ఆహారాన్ని తినలేక అవస్థలు పడేవారు. విధిలేని పరిస్థితుల్లో ఇంటి నుంచి క్యారియర్లు కట్టుకుని వెళ్లేవారు. కూలీనాలీ చేసుకునే పేదలు తమ పిల్లల కోసం భోజనం వండి పంపించడం కష్టతరంగా ఉండేది. సర్కారు బడుల్లో కనీసం తాగునీరు కూడా అందుబాటులో ఉండేది కాదు. వారానికి ఒక్కరోజు సైతం కోడి గుడ్డు ఇవ్వలేని దుస్థితి. సమస్యలు చెప్పుకున్నా పరిష్కారంగాకపోవడంతో తల్లిదండ్రులు మిన్నకుండిపోయేవారు.

నేడు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచారు. పౌష్టికాహారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. మెనూలో రోజుకో వంటకం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇంటి భోజనాన్ని తలపించేలా శుచిగా.. రుచికరంగా ఆహార పదార్థాలను తయారు చేసి వడ్డిస్తున్నారు. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రక్తహీనత, బలవర్ధ ఆహారం కోసం రాగి జావ, చిక్కీలు అందిస్తున్నారు. బడుల్లో పరిశుద్ధమైన తాగునీటికి ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. పేద విద్యార్థుల ఆరోగ్య రక్షణను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చక్కటి పౌష్టికాహారం సమకూరుస్తున్నారని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



యాదమరి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ (ఫైల్)

ఇది కదా.. అభివృద్ధి

రుచిగా..శుచిగా.. గోరుముద్ద

- సర్కారు బడుల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం
- విద్యార్థులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం
- పకడ్బందీగా అమలవుతున్న జగనన్న గోరుముద్ద
- పిల్లల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం
- నాలుగేళ్లు పూర్తి చేసుకున్న మహోన్నత పథకం

యాదమరి: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే ఉన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరుముద్ద పథకం ప్రవేశపెట్టారు. అందులో భాగంగా పోషకవిలువతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. పేద తల్లిదండ్రులకు తమ పిల్లల చదువు భారం కాకూడదనే మహోన్నత ఆశయంతో విప్లవాత్మకమైన పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక అందిస్తోంది. అలాగే 2020 జనవరి 21వ తేదీన ప్రత్యేక మెనూతో జగనన్న గోరుముద్దను ప్రారంభించింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ పథకం క్షేత్రస్థాయిలో అద్భుతంగా అమలవుతోంది. పేద పిల్లలు ఆనందంగా కడుపారా భుజించే వెసులుబాటు కల్పిస్తోంది. తద్వారా విద్యార్థులను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతోంది.

నియోజకవర్గ సమాచారం

మండలం	ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత	హైస్కూళ్లు	విద్యార్థుల సంఖ్య
యాదమరి	54	10	07	4,036
బంగారుపాళ్యం	80	05	12	5,900
తవణంపల్లె	66	06	06	2,844
ఐరాల	54	04	07	3,180
పూతలపట్టు	52	07	11	3,432

పూతలపట్టు నియోజకవర్గంలో ఇలా..

పూతలపట్టు, యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె మండలాల్లో మొత్తం 381 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 19,392 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ పకడ్బందీగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. రోజుకో రకం వంటకంతో రుచికరంగా.. శుచిగా ఉండేలా ఆహార పదార్థాలను సిద్ధం చేయించి వడ్డిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాల మేరకు తయారు చేసిన వంటకాలను పిల్లలు సైతం ఇష్టంగా ఆరగిస్తున్నారు. చక్కటి పౌష్టికాహారం అందిస్తున్న ప్రభుత్వానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



యాదమరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ

అమలు చేస్తున్న మెనూ

- సోమవారం: హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, లేదా వెజిటేబుల్ పలావు, కోడి గుడ్డు పులుసు, చిక్కీ
- మంగళవారం: చింతపండు పులిహోరా, దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు, రాగి జావ
- బుధవారం: కూరగాయలతో అన్నం, ఆలూ కూర, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కీ
- గురువారం: టమాట పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు, సాంబార్‌బాత్, లేక నిమ్మకాయ పులిహోర, రాగి జావ
- శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, చిక్కీ
- శనివారం: ఆకు కూర అన్నం, పప్పు చారు, చక్కెర, లేక బెల్లం పొంగలి, రాగి జావ

చాలా బావుంది



పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చాలా బావుంది. రోజూ అన్నంతోపాటు గుడ్డు, చిక్కీ, ఇస్తున్నారు. గతంలో కంటే ఇప్పుడు రుచికరంగా, నాణ్యంగా ఉంటోంది. అలాగే మా బడిలో తరగతి గదులను విశాలంగా నిర్మించారు. కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటు చేశారు. గోడలపై ఆకట్టుకునేలా అందమైన చిత్రాలు వేయించారు. స్కూలుకు వెళ్లేందుకు చాలా ఆసక్తిగా ఉంటోంది.

– తమన్నా, 5వ తరగతి, కాశిరాళ్ల, యాదమరి మండలం

రాగి జావ ఇస్తున్నారు



వారంలో మూడు రోజుల పాటు ప్రత్యేకంగా రాగి జావ ఇస్తున్నారు. ఉదయం పాఠశాలలో ప్రార్థన అయిన వెంటనే గ్లాసుల్లో జావ నింపి అందిస్తున్నారు. చాలా రుచిగా ఉంటోంది. గతంలో బడిలో మధ్యాహ్న భోజనం చేయాలంటే తీవ్రంగా ఇబ్బంది పడేవాళ్లం. చాలా నాసికరంగా ఉండేది. ఇప్పుడు రకరకాల వంటకాలను వడిస్తున్నారు. కడుపునిండా తింటున్నాం.

– ధర్మతేజ, 9వ తరగతి, పి.కొత్తకోట, పూతలపట్టు మండలం



ఐరాల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఆరగిస్తున్న విద్యార్థినులు

నిత్యం తనిఖీ



మా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని నిత్యం మా ప్రధానోపాధ్యాయుడు తనిఖీ చేశారు. తర్వాతే మాకు వడ్డిస్తారు. దీంతో ఆహార పదార్థాలను నిర్వాహకులు బాగా వండుతున్నారు. పిల్లలందరం చక్కగా తిని హాయిగా చదువుకుంటున్నాం. రాగిజావ, చిక్కీ, గుడ్డు తినడం వల్ల మా ఆరోగ్యం చాలా బావుంటోంది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవు.

– మాధురి, 8వ తరగతి, పూతలపట్టు

ఆరోగ్యంగా ఉన్నారు



నాకు ఇద్దరు పిల్లలు. ప్రభుత్వం పాఠశాలలోనే ఒకరు తొమ్మిది, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. బడిలో రోజూ రుచికరంగా మధ్యాహ్న భోజనం పెడుతుండడంతో బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారు. ఇందంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమే. గతంలో ఇదే పాఠశాలలో ఆహారం తినాలంటే పిల్లలు భయపడేవారు. ఇప్పుడు ఆనందంగా తింటున్నారు.

– మాణిక్యమ్మ, పి.కొత్తకోట, పూతలపట్టు మండలం

పక్కాగా అమలు



జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పిల్లలకు మెనూ ప్రకారం అన్నీ అందించేలా చర్యలు చేపట్టాం. ఈ క్రమంలనే ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీ చేసి భోజనం రుచి చూస్తున్నాం. ఎంతమంది విద్యార్థులు తిన్నారో వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయిస్తున్నాం. పిల్లల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యమిస్తున్నాం. – రుక్మిణి, ఎంఈఓ, యాదమరి మండలం

రా 'బలవంతంగా' కదలి రా!

సభలు నిర్వహించేందుకు ముందుకు రాని నాయకులు.. బాబు జిమ్మిక్కులకు మళ్లీ మోసపోతామేమోనన్న మీమాంసలో టీడీపీ ఆశావహులు.. టిక్కెట్ రాకముందే ఉన్నది ఊడ్చిపెడితే తర్వాత పరిస్థితేంటన్న మీమాంసలో ముఖ్యనేతలు.. వెరసి! రా..కదలిరా.. సభలు జనం లేక వెలవెలబోతున్నాయి. అభ్యర్థులను ప్రకటించకముందే సభలు పూర్తిచేయాలన్న వ్యూహంలో ఉన్న బాబు పన్నాగానికి అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. ఇప్పుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇలాంటి పరిస్థితే ఎదురవుతోంది. సొంత జిల్లాలో సభ నిర్వహించకపోతే పరువుపోతుందని భావించిన చంద్రబాబు కల్లబొల్లి మాటలతో నేతలను పురమాయించినా ఎవ్వరూ ముందుకు రాకపోవడం విశేషం.

- రా కదలి రా! సభ నిర్వహణకు ముందుకు రాని టీడీపీ నేతలు
- సొంత జిల్లాలో పెట్టేందుకు ముప్పతిప్పలు
- నెల రోజులుగా పలుమార్లు నాయకులతో బాబు చర్చలు
- థామస్‌ని బలవంతంగా ఒప్పించిన సీనియర్ నేతలు
- నేడు గంగాధరనెల్లూరులో 'రా కదలిరా సభ'
- జన సమీకరణకు తమ్ముళ్ల పాట్లు

సాక్షి, తిరుపతి: ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ బలనిరూపణకు దిగింది. అందులో భాగంగా జిల్లాకు ఒక భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. అభ్యర్థులను ప్రకటించకముందే సభలు నిర్వహిస్తే సక్సెస్ అవుతామని చంద్రబాబు ప్రణాళిక రచించారు. అందులో భాగంగానే అభ్యర్థులను ప్రకటించకముందే రా కదలి రా సభలు పూర్తి చేయాలని భావించారు. టిక్కెట్ ఆశించే వారు తమ బలాన్ని నిరూపించుకునేందుకు ఎవరికి వారు పోటీపడి సభలకు జనాలను తీసుకొస్తారని బాబు పన్నాగం పన్నారు. అయితే ఆయన కుట్రపూరిత ప్రణాళికను గ్రహించిన ఆశావహులు ఎక్కడిక్కడ మొహం చాటేస్తూ వస్తున్నారు. ఫలితంగా రా కదలిరా సభలు జనం లేక వెలవెలబోతున్నాయి.



ముందుకుతోసి.. తప్పుకుంటున్నారు

సభ నిర్వహించేందుకు అతికష్టంపై ఒప్పుకున్న థామస్‌పై టీడీపీ నేతలు మరింత భారం మోపినట్లు తెలుస్తోంది. తన శక్తి కొద్దీ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన భావించారు. అయితే మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి 2 లక్షల మందితో సభ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మాజీ మంత్రి ప్రకటనతో థామస్ షాక్ గురయ్యారు. ఐదువేల మంది వస్తేనే ఎక్కువ అని, అటువంటిది రెండు లక్షల మందిని ఎక్కడి నుంచి తీసుకురావాలి? అని ప్రశ్నించినట్లు తెలిసింది. జనానికి ఒక్కొక్కరికీ కనీసం రూ.200 అయినా ఇవ్వకపోతే రారని తేల్చిచెప్పారు. అంత ఖర్చు తన వల్ల కాదని చేతులెత్తేసినట్లు తెలిసింది. ముందు ఒప్పిస్తే.. పరువు కోసమైనా సభ నిర్వహించక తప్పదు కదా? అనే ఆలోచనతో థామస్‌ని ముందుకు తోసినట్లు ప్రచారం జరుగుతోంది. సభ నిర్వహణ కోసం థామస్ ఇప్పటికే రూ.5 కోట్ల వరకు ఖర్చుచేసినట్లు విశ్వసనీయ సమాచారం. రా కదలి రా సభ పేరుతో తన ఒంటి మీద ఉన్న బట్టలన్నీ విప్పించేస్తున్నారంటూ థామస్ తన అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు గంగాధరనెల్లూరులో టీడీపీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే.. జన సమీకరణ బాధ్యతలు అన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు అప్పగించినట్లు తెలిసింది. చంద్రబాబు సభకు జనం వెళ్లేందుకు ఆసక్తి చూపించడంలేదని సమాచారం. దీంతో ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు జనం రావడానికి ఇష్ట పడడంలేదని చెప్పి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలోని జనాన్నే తరలించమని చెప్పండంటూ టీడీపీ నేతలు తప్పించుకున్నట్టు సమాచారం.

చేతులెత్తేశారు

తిరుపతి జిల్లా, వెంకటగిరిలో ఇటీవలే నిర్వహించిన రా కదలిరా సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. ఇక చిత్తూరు జిల్లాలో అయినా భారీ ఎత్తున నిర్వహించి పరువు కాపాడుకోవాలని చంద్రబాబు అండ్ కో తాపత్రయపడ్డారు. ఇందులో భాగంగానే ముందుగా నగరిలో నిర్వహించాలని అనుకున్నా.. అక్కడ గాలిభాను తన వల్ల కాదని చేతులెత్తేశారు. చిత్తూరులోఎవ్వరూ ముందుకు రాకపోవడం.. పూతలపట్టులో ఖర్చు పెట్టుకోలేమని చెప్పడం.. పుంగనూరులో అయితే కచ్చితంగా షో ఫ్లాప్ అవుతుందని భయపడ్డారు. పలమనేరులో మాజీ మంత్రి సుముఖంగా లేరు. ఇలా అన్ని చోట్లా ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోయింది. సొంత జిల్లాలో రా కదలి రా సభ నిర్వహించకపోతే పరువు పోతుందని గంగాధరనెల్లూరులో పెట్టాలని నిర్ణయించారు. అయితే అభ్యర్థి ఎవరనేది ఖరారుకాకనే ఎవరికి బాధ్యతలు అప్పగించాలో తెలియక ఆ పార్టీ నేతలు మల్లగుల్లాలు పడ్డారు. చివరకు థామస్‌ని అడిగితే పెత్తనం ఒకరిది, ఖర్చు నాకా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. సభ పెట్టి సక్సెస్ చేస్తే టికెట్ నీకే అని బలవంతంగా ఒప్పించినట్లు సమాచారం.

వైభవం.. కుంభాభిషేకం



ఊరేగింపుగా పట్టువస్త్రాలు తీసుకెళుతున్న మంత్రి ఆర్‌కే రోజా తదితరులు

నగరి : పట్టణంలోని దేశమ్మ ఆలయ అష్ట రజిత మహాకుంభాభిషేక మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. టీఆర్ కండ్రిగ పోతురాజు ఆలయం వద్ద నుంచి మహిళలతో కలిసి మంత్రి ఆర్‌కే రోజా ఊరేగింపుగా పట్టువస్త్రాలను తీసుకుని దేశమ్మ సన్నిధికి బయలుదేరారు. మంగళవాయిద్యాలు, కోలాటాలు, నృత్యాల నడుమ ఊరేగింపు కనులపండువగా సాగింది. ఆలయం వద్ద పాలకమండలి చైర్మన్ వేణు బాబు, ఈఓ రామచంద్రయ్య ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోజా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా చేపట్టిన గణపతి హోమంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ నేత్రప్రదాయనిగా పేరుగాంచిన దేశమ్మ తల్లి ఆలయాన్ని నూతనంగా నిర్మించే మహద్భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతమన్నారు. కుంభాభిషేకంలో తొలిరోజున విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవచనం, శుద్ధి పూజలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సైతం దేశమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందారని వెల్లడించారు. దేశమ్మతల్లి కరుణాకటాక్ష వీక్షణాలు నగరి నియోజకవర్గంతోపాటు జగనన్న, రాష్ట్రం మీద ఉండాలని ప్రార్థించినట్లు వివరించారు.



ప్రత్యేక పూజల్లో మంత్రి రోజా

క్లుప్తంగా

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం


జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి పలు శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 402 సచివాలయాల్లో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాకు ఇప్పటి వరకు 3,08,544 ఆరోగ్యశ్రీ కార్డులు వచ్చాయని, 2,09,585 పంపిణీ చేశారని తెలిపారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పకడ్బందీగా రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. కులగణన వివరాలను వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. అలాగే పోలింగ్ కేంద్రాలల్లో పక్కాగా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్, డీపీఓ లక్ష్మి, ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీజుల పేరిట ఇబ్బందులపై ఫిర్యాదు


కలెక్టరేట్ ఎదుట తల్లిదండ్రులు, నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులను ఫీజుల పేరుతో పరీక్షలు పెట్టకుండా నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఇబ్బంది పెడుతోందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రామారావ్, జిల్లా జాయింట్ సెక్రటరీ ధనరాజ్ ఆరోపించారు. ఈ మేరకు స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఎస్సీ, ఎస్టీ పిల్లలను కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్స్‌లో చదివించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. అయినప్పటికీ పలు స్కూళ్ల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పక్కాగా పట్టా.. హక్కు

నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం కింద లక్షలాది కలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. అత్యాధునిక మౌలిక వసతులతో తీర్చిదిద్దిన కాలనీల్లో ఇంటి పట్టాలు అందించారు. గృహ నిర్మాణాలకు సైతం చేయూతనందించారు. సొంతింటి స్వప్నం నెరవేర్చడంతో పాటు లబ్ధిదారులకు పూర్తిస్థాయి హక్కులు కల్పిస్తున్నారు. ఈ మేరకు ఆయా సచివాలయాల్లోనే ఇంటి పట్టాలను పక్కాగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో తమకు తోబుట్టువుగా నిలబడి ఆదరిస్తున్న ముఖ్యమంత్రికి ఆడపడుచులు అభినందనలు తెలియజేస్తున్నారు. జీవితాంతం రుణపడి ఉంటామని వెల్లడిస్తున్నారు. ప్రజాప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చుకుంటామని ప్రతినబూనుతున్నారు. – కార్వేటినగరం


ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలు సిబ్బంది

నమ్మలేక పోతున్నా



నిరుపేదను అయినా అగ్రవర్ణానికి చెందిన వాడినని గతంలో ఎలాంటి సంక్షేమ పథకాలు అందేవి కావు. పూట గడవని పరిస్థితుల్లో ఇంటి అద్దె కూడా చెల్లించలేక నానా అవస్థలు పడేవాళ్లం. జగనన్న అధికారంలోకి వచ్చాక మాకు అన్ని పథకాలు అందుతున్నాయి. ఇంటి స్థలం సైతం కేటాయించారు. ప్రభుత్వ సాయంతో ఇల్లు నిర్మించుకున్నా. ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా మాకు ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ చేయించారు. ఇందతా నిజమేనా అని ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. జగనన్నకు రుణపడి ఉంటా.

– ఎస్.శ్రీనివాసులు రాజు, పద్మ సరస్సు, కార్వేటినగరం

ఎప్పటికీ జగనన్న వెంటే



కడుపున పుట్టిన వారే పట్టించుకోని నేటి సమాజంలో ముఖ్యమంత్రి జగనన్న తోబుట్టువులా మహిళలను ఆదుకుంటున్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. సొంతిల్లు అనేది కలలోనే అనుకునే మాలాంటి పేదలకు సైతం ఇంటి పట్టా మంజూరు చేశారు. ఇప్పుడు ఆ స్థలాన్ని కూడా మా పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. ఇంతలా మాకు అండగా నిలుస్తున్న జగనన్న వెంటనే ఎప్పటికీ ఉంటాం.

– ఆర్‌జీ రజని, పద్మ సరస్సు లేఅవుట్, కార్వేటినగరం

మేలు మరువలేం



మా లాంటి నిరుపేదలకు సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా, ఇంటి స్థలం మంజూరు చేశారు. పక్కాగృహం నిర్మించుకునేందుకు సాయం చేశారు. ఇప్పుడు మాకు ఇచ్చిన స్థలాన్ని అన్ని హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. మాకు పూర్తిస్థాయిలో ఒక చిరునామా కల్పించిన జగనన్న మేలును జీవితంలో మరువలేం.

– బీఎస్ జీవరత్నమ్మ, పద్మసరస్సు లేఅవుట్, కార్వేటినగరం

9న 'నులి' నివారణ దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ రాజశేఖర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని స్పష్టం చేశారు. 1 నుంచి 2 ఏళ్ల లోపు పిల్లలకు అర్ధ మాత్ర (1/2 మాత్ర), 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి 400 ఎంజీ మాత్రను మధ్యాహ్నం భోజనం తర్వాత నమిలి మింగించాలన్నారు. మళ్లీ ఈ నెల 16వ తేదీన మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి మాట్లాడుతూ మాత్ర మింగిన తర్వాత పిల్లలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే 104,108కు కాల్ చేయాలని కోరారు. అనంతరం నులిపురుగుల నివారణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో పలు శాఖల జిల్లా అధికారులు వెంకటరామిరెడ్డి, తులసి, రాజ్యలక్ష్మి, రబ్బానీబాషా, చిన్నారెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ రాజశేఖర్

అధికారం కోసం అరాచకమా?

- హత్యా రాజకీయాలకు తెరతీసిన టీడీపీ నేతలు
- వైఎస్సార్‌సీపీ నాయకుల వెల్లడి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, వైఎస్సార్‌సీపీ నేతలు

నగరి : అధికారం కోసం టీడీపీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని, రాజకీయ లబ్ధి కోసం చివరకు హత్యాయత్నానికి తెగబడ్డారని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మండిపడ్డారు. సోమవారం నగరి పురపాలక కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మంత్రి రోజా కార్యాలయ నిర్వాహకుడు ప్రతీష్‌పై హత్యాయత్నం కేసులో తమిళనాడు పోలీసులు అరెస్టు చేసిన వారు, పరారీలో ఉన్నవారు టీడీపీ నేతలే అని స్పష్టం చేశారు. నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భానుప్రకాష్‌తో సన్నిహిత సంబంధం ఉన్నవారే అని సాక్ష్యాధారాలతో వెల్లడైందన్నారు. మంత్రి రోజాకు లభిస్తున్న జనాదరణను ఓర్వలేకే టీడీ పీ నేతలు తమ ద్వేషాన్ని ఇలా వ్యక్తం చేస్తున్నారని విమర్శించారు. హత్యాయత్నానికి ఒడిగట్టిన వారు ప్రజలకు ఏవిధంగా అండగా ఉండగలరని ప్రశ్నించారు. ప్రాణం విలువ తెలియని టీడీపీ నేతలు పేదలకు ఏం మేలు చేయగలరన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి నేతృత్వంలో నగరి ప్రశాంతంగా ఉందని తెలిపారు. అలాంటి మంచి వ్యక్తిపై విద్వేషంతో టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిని మాత్రమే పోలీసులు పట్టుకున్నారని, పథకం రచించిన చిట్టిబాబు పరారీలో ఉన్నాడని, ఆయన పట్టుబడితే ప్రధాన సూత్రధారులెవరో ప్రజలందరికీ తెలుస్తుందని స్పష్టం చేశారు. హత్యారాజకీయలను ప్రోత్సహిస్తున్నందునే భానుప్రకాష్‌ను సొంత కుటుంబసభ్యులే ద్వేషిస్తున్నారని వెల్లడించారు.


లోకేష్ పాదయాత్రలో నిందితుడు వెట్టునవీన్ (ఫైల్)




గాలి భానుప్రకాష్‌తో నిందితులు చిరంజీవి, పరశురామ్, చిట్టిబాబు (ఫైల్)

బాధ్యతగా 'స్పందన' అర్జీల పరిష్కారం

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనలో ప్రజలు అందించిన అర్జీలను క్షేత్రస్థాయిలో అధికారులు బాధ్యతగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్‌తో కలిసి ఆయన వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్పందన నిర్వహిస్తోందన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల నుంచి మొత్తం 218 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని ఏఆర్ పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు నుంచి ఫిర్యాదులు, వినతులను ఏఎస్పీ ఆరీఫుల్లా స్వీకరించారు. అర్జీలను వెంటనే విచారించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.


అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, జేసీ శ్రీనివాసులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పుత్తూరు: పట్టణంలోని నందిమంగళం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యకి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... స్థానిక గేట్‌పుత్తూరు శీలకారువీధిలో నివాసం ఉంటున్న ఎంజీ శరవణన్(28), తిరుమలకుప్పం గ్రామానికి ఎస్.నరేష్ (30) మోటార్‌సైకిల్‌పై నగరికి వెళుతుండగా వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో శరవణన్ మృతి చెందగా, నరేష్ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. మృతుడి తండ్రి గుణశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శరవణన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


శరవణన్ (ఫైల్)

నదిలో గుర్తు తెలియని మృతదేహం

పలమనేరు : క్యాటిల్‌ఫామ్ వద్ద కౌండిన్య నదిలో ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని (సుమారు 50) స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి ఒంటిపై అడ్డగీతల పుల్‌షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు, జంధ్యం ఉన్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో ఆవుల మృతి


ఆవు కళేబరం

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని గోపాలపురం అటవీ ప్రాంతంలో విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి చెందాయి. వివరాలు.. దేశిరెడ్డిగారిపల్లెకు చెందిన కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా షెడ్ వేసుకుని పశుపోషణ చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం మేతకు వెళ్లిన ఆవుల్లో మూడు తిరిగి రాలేదు. అడవిలో గాలింపు చర్యలు చేపట్టగా ఆవుల కళేబరాలు కనిపించాయి. స్థానిక గుండాలమ్మగుడి వద్ద వేటగాళ్లు అటవీ జంతువుల కోసం విద్యుత్ తీగలతో వేసిన ఉచ్చులు తగిలి ఆవులు మరణించినట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడు ఫారెస్ట్ అధికారులకు పిర్యాదు చేశాడు.

విధుల్లో చేరిన 25 మంది తహసీల్దార్లు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల బదిలీల్లో జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లలో 25 మంది సోమవారం విధుల్లో చేరినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. గుడిపాల, సదుం, సోమల, చౌడేపల్లె, బంగారుపాళ్యం, శాంతిపురం, తవణంపల్లె తహసీల్దార్లు మాత్రం విధుల్లో చేరాల్సి ఉందని వెల్లడించారు.

సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్

చిత్తూరు కార్పొరేషన్: జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలకు సెలవు రోజుల్లో సైతం రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెలలో 10,11,18 తేదీల్లో సెలవు అయినప్పటికీ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు వెల్లడించారు. సచివాలయ సిబ్బందికి ఎలాంటి సందేహం వచ్చినా సబ్ రిజిస్ట్రార్లను సంప్రదించవచ్చని సూచించారు.

విభిన్నప్రతిభావంతులకు ఎన్నికల విధుల మినహాయింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న విభిన్న ప్రతిభావంతులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కల్పించారు. సోమవారం ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ ముఖేష్‌కుమార్‌మీనా ఉత్తర్వులు జారీచేశారు.

ఆశలు మునిగె..శోకం మిగిలె ..

జిల్లాలో నీటమునిగి ఐదుగురు మృతి
- పాకాలలో ఈతకెళ్లి ముగ్గురు చిన్నారులు మృత్యువాత
- శ్రీకాళహస్తిలో చెరువులో దిగి నీటమునిగిన తల్లీకూతుళ్లు
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు


పునీత్, కన్నయ్య మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

పాకాల/ శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. వేర్వేరు చోట్ల నీటమునిగి ఐదుగురు మృత్యువాత పడ్డారు. ఇందులో ఈత కోసం వెళ్లి ముగ్గురు చిన్నారులు మృతిచెందగా.. బర్రెలను తోలేందుకు చెరువులోకి దిగి తల్లీకూతుళ్లు మృతిచెందారు. ఈ ఘటన ఆయా కుటుంబీకుల్లో పెను విషాదాన్ని మిగిల్చింది.

ఈత..గుండె కోత

చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, ఊటువంక గ్రామానికి చెందిన రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు నిరుపేదలు. కూలికెళ్లి పొట్టపోసుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులుండగా.. పెద్దవాడు ఎల్.పునీత్(10), ద్వితీయ కుమారుడు ఎల్.కన్నయ్య(9) స్థానిక పాఠశాలలో 5, 4 తరగతులు చదువుతున్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన ఎస్.శేఖర్, ఎస్.జ్యోతి కుమారుడు ఎస్.తేజేశ్వర్(8) అదే పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నారు. వీరు ముగ్గురూ స్నేహితులు. ఎస్.తేజేశ్వర్ బుద్ధిమాంద్యంతో బాధపడుతున్నాడు. ప్రభుత్వం విద్యార్థికి ప్రత్యేక ప్రతిభావంతుల కింద నెలకు రూ.3 వేలు పింఛన్ అందజేస్తోంది. సోమవారం సాయంత్రం పాఠశాల ముగిసిన వెంటనే ఆడుకుంటూ సమీపంలోని కుంట వద్దకు చేరుకున్నారు. ఈత కొట్టాలనే ఉద్దేశంతో బట్టలు విప్పి గట్టుమీద పెట్టి కుంటలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండడం.. ఈత రాకపోవడంతో నీటమునిగిపోయారు. సాయంత్రం వరకు చిన్నారులు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులను వెంటతీసుకుని కుంటవద్దకెళ్లగా అక్కడ గట్టుపై దుస్తులు కనిపించాయి. ఆపై గుంటలోకి దిగి గాలించగా చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ రాజగోపాల్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదవశాత్తు కుంటలోకి దిగి మృతిచెందారని తెలిపారు. గ్రామంలో ముగ్గురు చిన్నారులు మృతిచెందడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది.

గ్రామంలో అలముకున్న విషాద ఛాయలు

ఒకే గ్రామంలో ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడడంతో ఊటువంక గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చిన్నారులు బాగా చదువుకుని తమ కష్టాలను గట్టెకిస్తారని ఆశతో ఉన్న తల్లిదండ్రులకు నిరాసే మిగిలింది. పేదరికంలో ఉన్నా పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చాలనే దృఢ సంకల్పంతో కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. కాలం చిన్న చూపు చూసి విధి వంచించడంతో చిన్నారులను మృత్యువ కబలించింది. గ్రామంలోని ప్రతీ ఒక్కరు చిన్నారుల మృతదేహాల వద్ద రోధిస్తున్నారు. విషయం తెలుసుకున్న మండలంలోని ప్రతీ ఒక్కరు ఊటువంక చేరుకుని చిన్నారుల తల్లిదండ్రులు చేస్తున్న ఆర్తనాదాలను చూసి కంటతడి పెట్టారు.